సాక్షి
నంద్యాల

శుక్రవారం । 23 । ఆగస్టు । 2024




హరివిల్లు సోయగం

ఆలూరు రూరల్: పచ్చని పొలాలు, చుట్టూ కొండల మధ్య ఆకాశంలో విరిసిన హరివిల్లు కనువిందు చేసింది. ఆలూరు–హొళగుంద రహదారిలో గురువారం ఈ దృశ్యం కనిపించింది.



అధికారుల నిర్లక్ష్యం..

ఎన్నికల సమయంలో రాయలసీమ యూనివర్సిటీని ఉపయోగించుకున్న అధికారులు.. ఆ తర్వాత మరమ్మతులు మరిచారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,627.45
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	: 82
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 33,443
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:9,413

న్యూస్‌రీల్

ఎరువుల అమ్మకాలు నిలిపి వేత



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): పట్టణంలోని బైసాని ట్రేడర్స్, గోర్ల వెంకటనారాయణశెట్టి ఎరువుల దుకాణాల్లో డీఏఓ మురళీకృష్ణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి సరైన పత్రాలు, బిల్ బుక్స్, నిల్వలు సక్రమంగా లేకపోవడంతో రూ.8.40 లక్షలు విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలిపి వేశారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ కంపెనీ ప్రతినిధులు, హోల్ సేల్, రిటైల్ దుకాణాల యజమానులు రైతులకు సరిపడ ఎరువులను సక్రమంగా సరఫరా చేయాలన్నారు. రిజిస్టర్, గ్రౌండ్ బ్యాలెన్స్‌లు సమానంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎరువులు, పురుగు మందులు కొన్న ప్రతి రైతుకు బిల్లు వేసి రసీదులు ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట మండల ఏఓ ప్రసాద రావు, ఏఈఓ మహేష్ ఉన్నారు.

రీచ్‌ల నుంచే ఇసుక తెచ్చుకోండి

బొమ్మలసత్రం: జిల్లాలో ఇసుక రేవులు, రీచ్‌లు లేనందున కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రీచ్‌ల నుంచే ఇసుకను కొనుగోలు చేసి తెచ్చుకోవాలని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు జిల్లాలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను కొనవద్దని సూచించారు. అక్రమంగా ఇసుక నిల్వలు ఉంటే 9121101085(నంద్యాల డీఎస్పీ), 9121101163(ఆళ్లగడ్డ డీఎస్పీ), 9121101113(డోన్ డీఎస్పీ), 9121101180(ఆత్మకూరు డీఎస్పీ), 9154987020(ఎస్పీ ఆఫీస్)కు సమాచారం ఇవ్వాలని కోరారు.

జిల్లా వ్యాప్తంగా తనిఖీలు

బొమ్మలసత్రం: జిల్లా వ్యాప్తంగా గురువారం తనిఖీలు నిర్వహించామని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. 7 మద్యం కేసులు నమోదు చేసి 108 లీటర్ల నాటుసారా, 129 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని 1,600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. డోన్‌లో పేకాట స్థావరంపై దాడిచేసి నలుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.16,150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. రెండు మట్కా కేసులు నమోదు చేసి రూ.18,676 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 85 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న వాహనాలను సీజ్ చేసిన క్రమంలో 316 కేసులకు గాను రూ.1,63,760 జరిమానా విధించామన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకుని 30 టన్నుల ఇసుక సీజ్ చేశామన్నారు. 360 కేజీల పీడీఎస్ రైస్‌ను స్వాధీనం చేసుకుని, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రాణదాతలకు భద్రత కరువు

- ఆసుపత్రుల్లో మహిళా వైద్యుల భద్రతకు చర్యలు శూన్యం
- టాయిలెట్స్, డ్రస్ చేంజ్ రూంలు లేక నర్సులు అగచాట్లు
- పేషెంట్ల తరపున వచ్చిన కొందరు మందుబాబుల ఆకతాయి చేష్టలు

ప్రజల ప్రాణాలు రక్షించే వైద్యులకే రక్షణ కరువవుతోంది. మహిళా వైద్యుల పరిస్థితి మరీ దారుణం. అడుగడుగునా లైంగిక వేధింపులు, సూటిపోటి మాటలతో వారి ఏకాగ్రతను కొందరు దెబ్బ తీస్తుంటారు. ఇటీవల పేషెంట్ల బంధువుల దాడులు కూడా అధికమయ్యాయి. ఇంత అభద్రతా భావం మధ్య విధులు నిర్వహిస్తున్న డాక్టర్లను.. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య ఘటన నేపథ్యం మరింత భయపెట్టింది. అందుకే తమకు భద్రత కల్పించాలని కొన్ని రోజులుగా రోడ్లెక్కి నినదిస్తున్నారు. తమ ప్రాణాలకు భద్రత కల్పిస్తే తాము మరింత ధైర్యంగా రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకే కృషి చేస్తామంటున్నారు.

– నంద్యాల(అర్బన్)/వ్యవసాయం/డోన్

నంద్యాల జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గాల్లో ఏర్పాటైన ప్రభుత్వాసుపత్రులు, సీహెచ్‌సీలలో వైద్య సిబ్బందికి అవసరమైన కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఆసుపత్రుల్లో డ్యూటీ డాక్టర్లు, స్టాఫ్‌నర్సులు, నర్సులు, సిబ్బందికి అవసరమైన టాయిలెట్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూములు లేకపోవడంతో ఒక్కో సారి ఆసుపత్రిలోనే దుస్తులు మార్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. యాక్సిడెంట్‌కు గురైన వారి వెంట ఎక్కువ మంది లోపలికి రావడం, మద్యం తాగిన వారు అమర్యాదగా మాట్లాడుతుండటం పరిపాటిగా మారింది. అవుట్‌పోస్టు పోలీసులు ఎప్పుడో కేసులు వచ్చినప్పుడు మాత్రమే లోపలికి వస్తుండటం, రాత్రి సమయాల్లో ఒకరిద్దరు మాత్రమే సెక్యూరిటీ సిబ్బంది ఉంటుండటంతో నర్సులు ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఎవరికి చెప్పాలో తెలియక ఆందోళన చెందాల్సిన పరిస్థితి. ఊరికి దూరంగా ఉండే ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వహించే వైద్యసిబ్బంది అవస్థలు వర్ణనాతీతం. సిబ్బంది సంచరించే ప్రాంతాల్లో రాత్రి వేళ లైట్లు వెలగకపోవడంతో బయటకు రావాలంటే ఆందోళన చెందాల్సిన పరిస్థితి. వైద్యసిబ్బందికి అవసరమైన వాష్, రెస్ట్, డ్యూటీ రూములు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ ఘటనకు నిరసనగా నంద్యాల శ్రీనివాస సెంటర్‌లోని టౌన్‌హాల్‌లో కొవ్వొత్తుల ప్రదర్శనల పాల్గొన్న డాక్టర్లు(ఫైల్)

నిబంధనలు పాటిస్తేనే ఫలితాలు

ఆసుపత్రిలో రోగి వెంట ఒకరికి మాత్రమే అనుమతి ఉంది. ప్రమాదం జరిగినప్పుడు, పరామర్శలకు అధిక సంఖ్యలో వస్తుండటంతో వారిని నియంత్రించే వారు లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మద్యం, ఇతర మత్తు పదార్థాలు తీసుకున్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వాసుపత్రిలోకి అనుమతించేందుకు వీలు లేదు. ఇలాంటి నిబంధనలు కఠినతరం చేస్తే సిబ్బంది స్వేచ్ఛగా విధులు నిర్వహించగలుగుతారు. చికిత్స అందించడంలో పొరపాట్లు జరిగి రోగి మృత్యువాత పడితే వైద్య సిబ్బందిపై దాడులు జరిగిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇదే అదునుగా భావించి కొంత మంది వ్యక్తిగత దాడులకు దిగే అవకాశమూ ఉంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వైద్యసిబ్బందికి భద్రత పెంచాల్సిన అవసరం ఉంది.

వాష్‌రూములు ఏర్పాటు చేయాలి



విధుల్లో ఉండే డాక్టర్లు, వైద్య సిబ్బందికి సరిపడా వాష్‌రూములతోపాటు డ్యూటీ రూములు, మహిళా వైద్యులు, విద్యార్థినుల కోసం కేటాయించిన గదుల వద్ద భద్రతను పెంచాలి. వయస్సు మళ్లిన వారు కాకుండా సుశిక్షితులైన భద్రత సిబ్బందిని ఆసుపత్రులు, కాలేజీల వద్ద సెక్యూరిటీగా నియమించాలి.

– డాక్టర్ వసుధ, ఐఎంఏ మహిళా అధ్యక్షురాలు, నంద్యాల

ఫిర్యాదు చేస్తే న్యాయం జరగాలి



ప్రభుత్వ ఆసుపత్రులు, కళాశాలల్లో ఉద్యోగులు, విద్యార్థుల సమస్యలపై ఫిర్యాదు చేయడానికి, పరిష్కరించడానికి ఫ్యాకల్టీ, వైద్యులు, ఇతర అధికారులే సభ్యులుగా ఉన్న అంతర్గత కమిటీలు బాగా పని చేయాలి. ఏదైనా సమస్య తలెత్తితే విద్యార్థినులు ఫిర్యాదు చేయడానికి సంకోచించే పరిస్థితులు ఉండకూడదు. న్యాయం జరుగుతుందనే భరోసా ఇవ్వాలి. కమిటీల్లో పోలీసులు, న్యాయ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులకు స్థానం కల్పిస్తే నిష్పక్షపాత విచారణకు వీలుంటుంది.

– నర్మద, స్త్రీ వ్యాధి నిపుణురాలు, నంద్యాల

దాడులు నియంత్రించాలి



ప్రమాదానికి గురైన సందర్భం, రోగిని పరామర్శించేందుకు వచ్చే సహాయకుల రాకపోకలపై షరతులు విధించాలి. పేషెంట్‌కు తోడుగా ఒక్కరిని మాత్రమే అనుమతించే నిబంధన పాటించాలి. మద్యం మత్తులో వచ్చే వారు సిబ్బందిపై దూషణలకు దిగుతున్న సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సహాయకులు, బంధువులు, స్నేహితులు రాకపోకలపై నియంత్రణ ఉండాలి. రోగి మృత్యువాత పడిన సందర్భాల్లో వైద్యసిబ్బందిపై దాడులు జరగకుండా నియంత్రించాలి.

– మాధవీలత, మత్తు వైద్యురాలు, నంద్యాల

విద్యార్థినుల పని వేళలపై దృష్టి సారించాలి



హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థినులు 36 గంటలు, రెండు మూడు రోజులు నిరంతరాయంగా విధులు నిర్వహిస్తున్న పరిస్థితి ఉంది. గతంతో పోలిస్తే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, పీజీ సీట్లు పెరిగాయి. వైద్య విద్యార్థినుల పని వేళలపై వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం 24 గంటలపాటు విధులు నిర్వహించిన విద్యార్థినికి డే ఆఫ్ తప్పని సరిగా ఇవ్వాలి.

– హర్షిత యాదవ్, వైద్య విద్యార్థిని, నంద్యాల

భద్రత కల్పించాలి



కలకత్తా వైద్య కళాశాలకు చెందిన వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి అమానుషంగా హతమార్చిన సంఘటన యావత్ దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. అన్ని ఆసుపత్రులలో వైద్యులతో పాటు సిబ్బంది ప్రాణ రక్షణ, భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పోలీస్ ప్రొటెక్షన్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ రమ్యశిల్ప, సీనియర్ గైనకాలజిస్ట్, ఏరియా ఆసుపత్రి, డోన్

వైద్యులను బాధ్యులను చేస్తే ఎలా



ఎంతో పవిత్రమైన వైద్య వృత్తిని ఎంచుకున్న యువతిని అత్యంత పాశవికంగా హత్య చేయడం దుర్మార్గం. అన్ని ఆసుపత్రులలో రోగులకు, వారి సహాయకులకు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. సౌకర్యాల లేని మూలంగా రోగులు ప్రాణాలు కోల్పోతే అందుకు వైద్యులను బాధ్యులను చేస్తే ఎలా

– డాక్టర్ పావని, ప్రభుత్వ వైద్యురాలు, డోన్

ఉన్మాదులను వదిలిపెట్టొద్దు



సమాజంలోని నిరుపేదలకు సేవచేయాలనే సంకల్పంతో వైద్య వృత్తిని ఎంచుకున్న కోల్‌కత్తా విద్యార్థిని హత్య కలిచివేసింది. ఆసుపత్రులలో రోగుల ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు ప్రయత్నిస్తారు. ఇటీవల కాలంలో ఆసుపత్రులు, వైద్యులు, సిబ్బందిపై దాడులు పెరగిపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

– నాగరాణి, నర్సింగ్ సూపరింటెండెంట్, ప్రభుత్వాసుపత్రి, డోన్

సెక్యూరిటీ పెంచాలి



ఆసుపత్రుల్లో ఐపీ, ఓపీ విభాగాలు దూరంగా ఉన్నందున జన సంచారం తక్కువగా ఉంటుంది. అలాంటి విభాగాల్లో రాత్రి విధులు నిర్వహించే మహిళా వైద్యులు సిబ్బంది ఇబ్బందులు పడకుండా సెక్యూరిటీ పెంచాలి. అనుమానాస్పద వ్యక్తులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వైద్య సిబ్బంది సంచరించే ప్రాంతాల్లో రాత్రి వేళ లైట్లు ఉండాలి. సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్ల నిరంతర పర్యవేక్షణ ఉండాలి. ఏవైనా ఇబ్బందులు ఉంటే తెలుసుకుని తక్షణమే పరిష్కరించాలి.

– అరుణకుమారి, స్త్రీవ్యాధి నిపుణురాలు, నంద్యాల

లేఅవుట్లకు అనుమతులు తప్పనిసరి

బనగానపల్లె రూరల్: లేఅవుట్లకు అనుమతులు తప్పనిసరి అని కుడా వైస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. కుడా అనుమతులు లేని పలు లేఅవుట్లలోని రోడ్లు, కాలువలు, గుర్తింపు రాళ్లను గురువారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కుడా అనుమతులు లేని 120 లేఅవుట్లను గుర్తించామన్నారు. వాటిలోని 50 లేఅవుట్లలో రోడ్లు, కాల్వలు, సర్వేనంబర్ రాళ్లను తొలగించామన్నారు. లేఅవుట్ల యజమానులకు 30 రోజుల్లో అనుమతులు తీసుకోవాలని నోటీసులు ఇచ్చామన్నారు. కుడా పరిధిలో ఉన్న గ్రామాల్లో లేఅవుట్లు వేసేందుకు పంచాయతీలకు అధికారాలు లేవన్నారు. బనగానపల్లె మండలంలో 40 లేఅవుట్లు అక్రమంగా వేసినట్లు గుర్తించామన్నారు. ఇలాంటి లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇబ్బందులు పడొద్దని ప్రజలకు ఆయన సూచించారు. ఆయన వెంట కుడా ప్లానింగ్ ఆఫీసర్ సంధ్యా, జిల్లా పంచాయతీ ఆఫీసర్ మంజులవాణి, సీఐ కృష్ణయ్య, నందివర్గం ఎస్ఐ బీటీ వెంకటసుబ్బరాయుడు, పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్ పాల్గొన్నారు.



అనుమతి లేకుండా వేసిన లేఅవుట్‌లో రోడ్లను తొలగిస్తున్న దృశ్యం

అవినీతి, అక్రమాలకు చోటు ఇవ్వొద్దు

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): అవినీతి, అక్రమాలకు చోటు ఇవ్వొద్దని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులకు సూచించారు. రెవెన్యూ సమస్యలను ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు, మ్యుటేషన్, భూ ఆక్రమణలకు సంబంధించి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వకుండా, వెబ్ ల్యాండ్‌లో నమోదు చేయకుండా, ల్యాండ్ లిటికేషన్‌లో ఉంచి అక్రమాలకు పాల్పడినట్లు వెల్లడైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కేంద్రంగా మారి రెండున్నరేళ్లవుతున్నా కర్నూలు నుంచి ఎందుకు భూ రికార్డులు తెప్పించుకోలేదన్నారు. శనివారంలోగా రికార్డులన్నీ తెప్పించుకోవాలని సూచించారు. అన్ని తహసీల్దార్ల కార్యాలయాల్లోని రికార్డ్ రూములను తాను పర్యవేక్షిస్తానని క్రమపద్ధతిలో రికార్డులు ఉంచాలని, రికార్డుల నిర్వహణను బట్టి పనితీరును అంచనా వేస్తామన్నారు. వచ్చేనెల రెండో వారం నుంచి రెవెన్యూ సదస్సులు ఉంటాయని, ఇనాం, ఆర్ఎస్ఆర్, అడంగల్ తదితర రెవెన్యూ రికార్డులను అందుబాటులో ఉంచుకుని సీనియర్ అధికారులు ఎవరొచ్చినా తడబడకుండా సమాధానాలు చెప్పాలన్నారు. ఏ గ్రామంలో ఎలాంటి సమస్యలు వస్తాయో విశ్లేషించుకుని ఆయా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో 112 లోకాయుక్త కేసులు ఉన్నాయని అందులో 36 రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉన్నాయని ఇందుకు సంబంధించిన రికార్డులన్నీ తాను పరిశీలిస్తానని అందుకు నివేదికల సిద్ధం చేయాలని సూచించారు. హైకోర్టులో కేసు ఫైల్ అయిన వెంటనే కౌంటర్ ఎందుకు వేయడం లేదని, కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ అమలు చేయకుండా కంటెంప్ట్‌కు ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. జాతీయ రహదారులు, రైల్వేస్, ఆర్అండ్‌బీ దారులకు అవసరమైన భూసేకరణను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్ఓ పద్మజ, ఆర్డీఓలు మల్లికార్జున్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఎం.దాసు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

వేదమూర్తి.. దివ్యదీప్తి

- మంత్రాలయంలో కనులపండువగా రాఘవేంద్రుల మహారథోత్సవం
- అశేష జనవాహినితో కిక్కిరిసిన శ్రీమఠం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మంత్రాలయం: తుంగాతీరం భక్తిపారవశ్యంతో ఉప్పొంగింది. వేదభూమి మంత్రోచ్ఛారణలతో పులకించింది. శ్రీరాఘవేంద్ర స్వామి మఠం అశేష భక్తజనంతో కిటకిటలాడింది. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన మంత్రాలయంలో గురువారం మహారథోత్సవం కనుల పండువగా సాగింది. రాఘవేంద్రుల ఉత్తరారాధనలో భాగంగా ముందుగా ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలను వేద పాఠశాలకు మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడ పాఠశాల విద్యార్థులు వేద పఠనం చేస్తూ విశేష పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ఉత్సవమూర్తి శ్రీమఠం మూల బృందావనం చేరుకోగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు విశేష పూజలు చేసి, వసంతోత్సవానికి శ్రీకారం పలికారు. గర్భాలయంలో అర్చకులు, పండితులు, పీఠాధిపతి గులాలు చల్లుకుని ఆచార వైభవాన్ని స్ఫురింపజేశారు. మంగళవాయిద్యాలతో ఉత్సవమూర్తి మహారథం చెంతకు చేరుకున్నారు.

మహారథంపై విహారం..

ఉత్సవమూర్తి మహారథం చేరుకోగా పీఠాధిపతి రథ చక్రాలకు నారికేళాలు సమర్పించి అర్చనలు చేశారు. ఉత్సవమూర్తితో మహారథం చుట్టూ ప్రదక్షిణలు చేసి మహారథంపై కొలువుంచారు. కొలువుదీరిన తరుణాన భక్తజనులు గోవిందా.. గోవిందా.. అంటూ ప్రణమిల్లుతూ స్మరణ చేసుకున్నారు. స్వామిజీ ప్రవచనం ముగియగానే భక్తులను ఆశీర్వచనం చేస్తూ మధ్యాహ్నం 2.30 గంటలకు రథోత్సవానికి అంకురార్పణ పలికారు. మంగళ వాయిద్యాలు, డప్పు దరువులు, రంగుల ఆటలు, బ్రాహ్మణ యువతుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, కోలాటాల మధ్య ఉత్సవం మధ్వ ద్వారం, ప్రధాన ముఖ ద్వారం మీదుగా రాఘవేంద్ర సర్కిల్ చేరుకుంది. అక్కడ స్వామిజీ పూర్వాశ్రమ కుటుంబ సభ్యులు ఉత్సవమూర్తికి పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. మంత్రాలయం పురవీధుల్లో గంటన్నర పాటు రథయాత్ర సాగింది.



ఊరేగింపుగా వస్తున్న ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు



క్షేత్ర కారిడార్ వీధుల్లో రథయాత్ర



మహారథం నుంచి భక్తులకు పీఠాధిపతి ఆశీర్వచనం



కర్ణాటక కళాకారిణి విన్యాసం



బ్రాహ్మణ యువతుల నృత్యం

భారతీయులపై దాడులు అమానుషం : పీఠాధిపతి

భారతదేశ హిందువులపై బంగ్లాదేశీయుల దాడులు అమానుషమని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. మత మార్పిడి ప్రేరణ తరహా దాడి పూనుకోవడం కలచి వేస్తోందన్నారు. హిందువులపై దాడులు తాను ఖండిస్తున్నట్లు తెలిపారు. విదేశీయులను చేరదీయడం, ఇతరులను ప్రేమించడం, ముఖ్యంగా సంప్రదాయాలను గౌరవించడం అలవర్చుకోవాలని సూచించారు. శ్రీమఠం దినదినాభివృద్ధికి అంతరంగిక భక్తుల సహకారం ఎంతో ఉందన్నారు. శ్రీమఠం వైభవానికి మరింతగా శ్రమిస్తామని పేర్కొన్నారు. శ్రీమఠంలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్, సంభావన కార్మికులకు రూ.2 వేలు జీతం పెంచుతున్నట్లు వెల్లడించారు.

మైసూరు రాజవంశీకుడికి అనుగ్రహ ప్రశస్తి పురస్కారం



రాఘవేంద్రుల ప్రశస్తి అవార్డు స్వీకరిస్తున్న మైసూరు రాజ వంశీకులు

వేడుకల్లో భాగంగా కర్ణాటకలోని మైసూరు రాజవంశీకులు, కొడగు పార్లమెంట్ సభ్యులు యదువీర్ కృష్ణదత్త చామరాజేంద్ర ఒడియార్‌కు రాఘవేంద్రుల అనుగ్రహ ప్రశస్తి పురష్కారాన్ని అందజేశారు. ఉదయం ఊంజల మంటప వేదికపై శ్రీమఠం పీఠాధిపతి చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ మైసూరు రాజవంశానికి శ్రీమఠానికి మంచి అవినావ సంబంధాలు ఉన్నట్లు తెలిపారు. ప్రజా సేవలో రాజవంశీకుల కృషి ఎనలేనిదని కొనియాడారు. వేడుకలో పండిత కేసరి రాజా ఎస్. గిరియాచార్, శ్రీమఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్–1 శ్రీనివాసరావు, మేనేజర్–2 వెంకటేష్‌జోషి, మేనేజర్–3 శ్రీపతి ఆచార్, పీఆర్వో నరసింహమూర్తి, ఆయాశాఖల బాధ్యులు పాల్గొన్నారు. ఆదోని డీఎస్పీ సోమన్న నేతృత్వంలో డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

వ్యక్తి దారుణ హత్య


శివరాముడి మృతదేహం

డోన్ రూరల్: మండల పరిధిలోని ఉడుముల పాడు గ్రామ సమీపంలోని ఫామ్ హౌస్‌లో ఓ వ్యక్తి గురువారం దారుణహత్యకు గురయ్యాడు. రూరల్ సీఐ రాకేష్ తెలిపిన వివరాలు.. బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లి గ్రామానికి చెందిన శివరాముడు(32) కొంత కాలంగా డోన్ విజయ్ జువెల్లర్స్ షాపు యజమాని రామాంజనేయులు ఆచారికి చెందిన ఫామ్‌హౌస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబంతో కలిసి ఫామ్‌హౌజ్‌లోనే నివాసం ఉంటున్నాడు. ఇద్దరు కుమారులు, భార్య ఈనెల 21న ఓ శుభకార్యం నిమిత్తం అనంతపురం జిల్లా గుంతకల్లుకు వెళ్లగా శివరాముడు ఒక్కడే ఫామ్ హౌజ్‌లో ఉన్నాడు. యజమాని వెళ్లి చూడగా రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే అతడు రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విషయం చెప్పాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య తులసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో బిహార్ వాసి మృతి

కర్నూలు: కర్నూలు మండలం ఎదురూరు గ్రామ శివారులో సూరత్–చెన్నై జాతీయ రహదారి పనుల్లో భాగంగా బ్రిడ్జి నిర్మాణం పనుల్లో బిహార్ కార్మికుడు ప్రేమ్‌లాల్ సాహ్ని (56) విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. బిహార్ రాష్ట్రం ముజఫర్‌పూర్ జిల్లా మితునాపూర్ గ్రామానికి చెందిన ప్రేమ్‌లాల్ సాహ్నితో పాటు మరికొంతమంది సూరత్–చెన్నై జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో కూలీలుగా పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. బుధవారం సాయంత్రం బ్రిడ్జి నిర్మాణం కోసం ఇనుప కడ్డీలు కట్ చేస్తుండగా పక్కనే ఉన్న జనరేటర్ వైర్‌కు ఇనుప కడ్డీ తగలడంతో విద్యుత్ సరఫరా జరిగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. వైద్యచికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమీప బంధువు వినోద్ సాహ్ని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రంలో భద్రపరచినట్లు పోలీసులు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం

- ఎన్నికల్లో ఆర్‌యూ వర్సిటీ బిల్డింగ్స్‌ను వాడుకుని వదిలేశారు
- ఇంజినీరింగ్ కళాశాలలో నిరుపయోగంగా కంప్యూటర్ ల్యాబ్
- సొంత ల్యాప్‌ట్యాప్‌లను వాడుకుంటున్న విద్యార్థులు
- రూ.లక్షలు వెచ్చిస్తేనే పూర్వపు స్థితి


రాయలసీమ విశ్వవిద్యాలయం కంప్యూటర్ ల్యాబ్‌లో నిరుపయోగంగా కంప్యూటర్స్, సీపీయూలు


ఆర్‌యూలో ఎన్నికల కౌంటింగ్ సమయంలో అతికించిన లేబుల్స్‌ను తొలగించని దృశ్యం


కంప్యూటర్ ల్యాబ్‌లో సొంత ల్యాప్‌ట్యాప్‌లను వాడుకుంటున్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్: ఎన్నికల అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాయలసీమ యూనివర్సిటీలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో మే 13న జరిగిన ఎన్నికల పోలింగ్‌కు నెల రోజుల ముందు నుంచి కౌటింగ్ జరిగిన జూన్ 4వ తేదీ తరువాత మరో 15 రోజుల వరకు రాయలసీమ విశ్వవిద్యాలయం జిల్లా మెజిస్ట్రేట్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆధీనంలో ఉంది. వర్సిటీని మొత్తం ఎన్నికల సంఘం కంట్రోల్‌కి పోయింది. ఈవీఎంలను భద్ర పరిచేందుకు వర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాల భవనం, లైఫ్‌సైన్సెస్ బిల్డింగ్స్‌ను వాడుకున్నారు. బిల్డింగ్స్‌లో ఉన్న తరగతి గదుల గోడలను పగులగొట్టారు. ల్యాబ్స్‌లో ఉన్న కంప్యూటర్స్‌ను, ఫర్నీచర్‌ను ఇతర బిల్డింగ్స్‌లోకి తరలించారు. ఈవీఎంలను రిసీవ్ చేసుకునేందుకు రెండు బిల్డింగ్‌ల ముందున్న ప్రాంతంలో ఉన్న మొక్కలు, చెట్లను పూర్తిగా కొట్టివేయించారు. ఎన్నికల కౌటింగ్ ముగిసి కూటమి ప్రభుత్వం కొలువు దీరింది. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయింది కానీ ఎన్నికల అధికారులు ఆర్‌యూ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఉన్నత విద్యకు ప్రాధాన్యం ఇస్తాం.. ఎలాంటి తప్పులు, అవకతవకలకు ఆస్కారం లేకుండా పాలన సాగిస్తాం అంటూ కూటమి అగ్రనేతలు ఉపన్యాసాలు ఊదరగొట్టారు.. ఊదర గొడుతున్నారు.. మరి ఆర్‌యూలో అందుకు విరుద్ధంగా పరిస్థితి నెలకొంది.

పూర్తి కాని పనులు.. నిరుపయోగంగా ల్యాబ్‌లు

వర్సిటీలో ఎన్నికలకు సంబంధించిన పనులు పూర్తి కాలేదు. పూర్తి కాకుండానే కొందరు ఇంజినీరింగ్ ఉద్యోగులు వర్సిటీ ఉన్నతాధికారులకు సంబంధం లేకుండా క్లియరెన్స్ సర్టిఫికెట్స్ ఇచ్చినట్లు తెలిసింది. ఇంజినీరింగ్ కళాశాల బిల్డింగ్, లైఫ్ సైన్స్, లైబ్రరీ బిల్డింగ్స్‌లో కౌటింగ్ సమయంలో గోడలకు అంటించిన స్టిక్కర్లు, నియోజక వర్గాల పేర్లు అలానే ఉండిపోయాయి. విద్యుత్ వైరింగ్ అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గోడల నిర్మాణ సమయంలో ఫర్నిచర్‌ను తొలగించకపోవడంతో పాడైపోయింది. ఆర్‌యూసీఈలోని కంప్యూటర్ ల్యాబ్ నిరుపయోగంగా మారింది. ల్యాబ్‌లో ఉన్న కంప్యూటర్లను తీసి ఒకమూలన పడేశారు. మానిటర్స్, సీపీయూలకు సంబంధించిన విద్యుత్ వైర్లను జాగ్రత్తగా తొలగించకుండా వాటిని పీకడం, కత్తిరించడం లాంటివి చేశారు. దీంతో ల్యాబ్ మొత్తం కంప్యూటర్లకు కనెక్టివిటీకి వైరింగ్ అందుబాటులో లేదు. ల్యాబ్ నిరుపయోగంగా ఉండటంతో ఆర్‌యూసీఈ బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులు వారి సొంత ల్యాప్‌ట్యాప్‌ల ద్వారా ప్రాజెక్ట్ వర్క్, ఆన్‌లైన్ తరగతులు వింటున్నారు. ల్యాబ్‌ను సరిచేయడానికే రూ. 2 లక్షల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. ఇలా ఎన్నికల అధికారులు పట్టించుకోక పోవడం, వర్సిటీ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది.

ల్యాబ్‌ను సరిచేయించాలి



ఆర్‌యూసీఈలో ఉన్న కంప్యూటర్ ల్యాబ్‌ను బాగు చేయించాలి. ఎన్నికల సమయంలో మా ల్యాబ్‌ను వాడుకోడానికి అక్కడ ఉన్న కంప్యూటర్లన్నింటినీ తీసి ఒక మూలన పడేశారు. ఇప్పటికీ అలాగే వదిలేశారు. కంప్యూటర్ ల్యాబ్ వినియోగంలో లేకపోవడంతో మా సొంత ల్యాప్ ట్యాప్‌లను తెచ్చుకొని వాడుకుంటున్నాం. అధికారులు స్పందించి ఆర్‌యూసీఈలో వసతులు మెరుగు పరచాలి.

– నందిని, బీటెక్ ఫైనల్ ఇయర్

స్టిక్కర్లను వదిలేశారు



వర్సిటీలోని పలు బిల్డింగ్స్‌లోని గోడలకు నియోజక వర్గాల పేర్లతో ఉన్న స్టిక్కర్లు అలేగా వదిలేశారు. వాటిని తొలగించకపోవడంతో బిల్డింగ్స్ అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. బారీగేడ్స్ కట్టే సయమంలో విద్యుత్ వైర్లు ఊడిపోయాయి. అవి ప్రమాదకరంగా ఉన్నాయి. మొత్తం బిల్డింగ్స్‌లో మరమ్మతులు చేయించి గతంలో మాదిరిగా మార్చాలి.

– రవి, బీటెక్ ఫైనల్ ఇయర్

చెట్లను తొలగించారు



ఎన్నికల కౌటింగ్ కోసమని ఆర్‌యూసీఈ, లైఫ్ సైన్స్ బిల్డింగ్స్ పరిసర ప్రాంతంలో ఉన్న మొక్కలు, చెట్లను కొట్టి వేయించారు. జేసీబీలతో వేర్లతో సహా చెట్లను తొలగించారు. వర్సిటీకి అందంగా ఉన్న మొక్కలు, చెట్లు తీసివేయడంతో బోసిపోయినట్లు ఉంది. ఎన్నికల అధికారులు, వర్సిటీ అధికారులు స్పందించి మరలా మొక్కలు నాటి వాటిని సంరక్షించుకునేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఖాజా, బీటెక్ ఫైనల్ ఇయర్

వర్సిటీ నుంచి క్లియరెన్స్ ఇవ్వలేదు

ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు వర్సిటీలోని రెండు బిల్డింగ్స్‌ను వారికి అప్పజెప్పాం. మేం గతంలో వారికి ఏ పొజిషన్‌లో ఇచ్చామో అదే మాదిరిగా మాకు అప్పగించాలి. ఏవైనా రిపేర్లు ఉంటే సరిచేయించాలి. సివిల్ వర్క్స్‌తో పాటు ఎలక్ట్రిసిటీ పనులు చేయించాలి. కంప్యూటర్ ల్యాబ్స్ మరమ్మతులు, గోడల నిర్మాణం, రంగులు వేయించాలి. అంత వరకు ఎన్నికల అధికారులకు బాధ్యత ఉంటుంది. పెండింగ్ ఉన్న పనులను త్వరగా పూర్తి చేయించకొని పనులు పూర్తి అయ్యాకే వర్సిటీ నుంచి క్లియరెన్స్ లెటర్ ఇస్తాం.

– డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లు, రిజిస్ట్రార్, ఆర్‌యూ

సంక్షేమ హాస్టళ్లకు ప్రత్యేక అధికారులు

కర్నూలు (అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాలకు ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా సంక్షేమ శాఖలకు సంబంధించి జిల్లాలో మొత్తం 86 వసతి గృహాలు ఉన్నాయి. ఈ వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం భోజనాలు అందుతున్నాయా, పరిశుభ్రత, విద్యార్థుల ఆరోగ్యం, సమస్యలు తదితర వాటిపై ప్రత్యేక అధికారులు తనిఖీలు నిర్వహించి నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందించాల్సి ఉంటుంది. స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ, ఆర్‌డీఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇంజినీర్లు, మున్సిపల్ కమిషనర్లతో పాటు జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులు ప్రత్యేక అధికారులుగా నియమించారు.

శిశువును గుర్తించి తీసుకెళ్లండి

నంద్యాల(అర్బన్): ఈనెల 7న శిరివెళ్ల మండల కేంద్రంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాల సమీపంలో చెత్తకుండీలో దొరికిన ఆడశిశువును గుర్తించి తీసుకెళ్లాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి నిర్మల గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం శిశువు కర్నూలులోని స్త్రీ శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన శిశు గృహంలో ఉందని, శిశువుకు సంబంధించి తల్లిదండ్రులు, బంధువులు ఎవరైనా.. ఆధారాలతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులను కలిసి శిశువును తీసుకెళ్లాలన్నారు. ఒక వేళ ఎవరూ రాకపోతే 30 రోజుల తర్వాత చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నిర్ణయం మేరకు అనాథగా తీర్మానించి సెంట్రల్ అడాప్షన్ రీసోర్స్ అథారిటీ నిబంధన మేరకు దత్తత ఇస్తామన్నారు. వివరాలకు బాలల సంరక్షణ అధికారి సెల్: 8919334858 ను సంప్రదించాలన్నారు.

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

బొమ్మలసత్రం: చేపల వేటకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం గురువారం లభ్యమైంది. తాలూకా పోలీసులు తెలిపిన వివరాలు.. నంద్యాల మండలం చాపిరేవుల గ్రామానికి చెందిన షేక్షా (15) మదరసాలో చదువుతున్నాడు. ఈనెల 20న చేపల వేట కోసం సమీపంలోని నీటి కుంటలో దిగి గల్లంతయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు తాలుకా పోలీసులను ఆశ్రయించారు. గురువారం మృతదేహం కుంటలో తేలినట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లి బయటకు తీసి షేక్షాగా గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వీబీకేపై కూటమి నేతల దౌర్జన్యం

- ఆస్పత్రి పాలైన చిరుద్యోగి

దేవనకొండ: మండలంలోని గుండ్లకొండ గ్రామంలో వీబీకే (విలేజ్ బుక్ కీపర్)గా పనిచేస్తున్న రంగస్వామిగౌడ్‌పై కూటమి నేతలు దౌర్జన్యం చేశారు. ఉద్యోగానికి రాజీనామా చేయాలని ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో రంగస్వామిగౌడ్‌కు బీపీ డౌన్ అయ్యి మెదడులో నరాలు దెబ్బతిన్నాయి. చికిత్స నిమిత్తం దేవనకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. గతంతో వీబీకేలకు ఎలాంటి జీతం ఉండేది కాదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.8 వేలు జీతం ఇచ్చి వీరి జీవితాల్లో వెలుగులు నింపింది. ఈ పోస్టులపై కూటమి నేతల కన్ను పడింది. ఈ కోవలోనే రంగస్వామిగౌడ్‌పై ఒత్తిడి తెస్తున్నారు. తాను ఏ తప్పు చేయలేదని, ఉద్యోగం పోతే భార్య పిల్లలను ఎలా బతికించాలని ఈయన వాపోతున్నారు.

ముందస్తు అంతరిక్ష దినోత్సవ వేడుకలు


రాకెట్ ఆకారంలో చిన్నవంగలి పాఠశాల విద్యార్థులు



ఇస్రో అక్షర రూపంలో విద్యార్థులు

చాగలమర్రి: ఈ నెల 23వ తేదీన జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని చిన్న వంగలి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్.జీవయ్య తెలిపారు. చంద్రయాన్–2 విజయాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ఆగస్టు 23వ తేదీని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా నిర్వహిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాకెట్, ఇస్రో అక్షరాల రూపంలో కూర్చున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి యువకుడి బలి


మహబూబ్‌బాషా మృతదేహం

నందికొట్కూరు: స్థానిక పగిడ్యాల రోడ్డులో పాత ఇనుప సామాను దుకాణంలో విద్యుదాఘాతానికి గురై అందులో పని చేస్తున్న యువకుడు దుర్మరణం చెందాడు. హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపిన వివరాలు.. సురేష్‌కు చెందిన పాత ఇనుప సామాను దుకాణంలో పగిడ్యాల మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన మొల్ల మహబూబ్ బాషా(28) కొంత కాలంగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం పాత కడ్డీలను కట్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తండ్రి చిన్న మహబూబ్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

నూనెపల్లి వీధిలో ప్లంబర్..

బొమ్మలసత్రం: నూనెపల్లి వీధిలో విద్యుదాఘాతానికి గురై ప్లంబర్ సంతోష్ (20) మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. నడిగడ్డ వీధిలో నివసిస్తున్న ఆర్టీసీ డ్రైవర్ శ్రీను శ్రీను కుమారుడు సంతోష్ ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. నూనెపల్లి వీధిలో ఓ ఇంట్లో కుళాయి మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలో పడిపోయాడు. ఇంటి యజమాని సంతోష్‌ను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

పెళ్లింట విషాదం

- గుండెపోటుతో పెళ్లి కుమారుని తండ్రి మృతి
- ఆగిన పెళ్లి వేడుక


శ్రీనివాసులు (ఫైల్)

శిరివెళ్ల: పెళ్లింట విషాదం నెలకొంది. కొద్ది గంటల్లో కుమారుని పెళ్లి జరగాల్సి ఉండగా తండ్రి గుండెపోటుతో మృతిచెందడంతో ఆ శుభకార్యం ఆగిపోయింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన బొంతల శ్రీనివాసులు(52) కుమారుడు దిలీప్‌కుమార్‌కు ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన సమీప బంధువుల అమ్మాయితో గురువారం ఉదయం 11.28 గంటలకు అమ్మాయి స్వగ్రామంలో వివాహం జరగాల్సి ఉంది. ఈక్రమంలో పెళ్లి కుమారుడి బంధువులంతా కలిసి ఒక రోజు ముందుగా ఈనెల ఈనెల 21న సాయంత్రం గిద్దలూరుకు చేరుకున్నారు. అక్కడ రాత్రి జరిగిన ఎదురుకోళ్ల కార్యక్రమం తర్వాత విందు ఆరగించారు. అనంతరం పెళ్లి కుమారుని తండ్రికి ఛాతీలో నొప్పి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. దీంతో ఉదయం జరగాల్సిన పెళ్లి వేడుక ఆగిపోయింది. ఇరు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని శిరివెళ్లకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

బదిలీలకు వేళాయె!

- దరఖాస్తు చేసుకుంటున్న పీఆర్ ఇంజినీర్లు
- ఏడుగురు డీఈఈలకు తప్పని స్థానచలనం
- అలాగే 43 మంది ఏఈలకు కూడా..


పీఆర్ ఎస్ఈ కార్యాలయం

కర్నూలు(అర్బన్): బదిలీలను కోరుతూ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో పలువురు ఇంజినీర్లు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఐదేళ్లు ఒకే ప్రాంతంలో విధులు నిర్వహించిన ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో పలువురు ఇంజినీర్లు తమ దరఖాస్తులను ఇప్పటికే ఈఎన్‌సీకి పంపినట్లు సమాచారం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 31 మంది డీఈఈలు ఉండగా, వీరిలో 8 మంది ఐదేళ్లు ఒకే ప్రాంతంలో పని చేసిన వారున్నారు. వీరు తమ బదిలీలను పరిశీలించాలని దరఖాస్తులను పంపించినట్లు తెలుస్తోంది. దరఖాస్తు చేయడంతో పాటు తాము కోరుకున్న స్థానాలకు వచ్చేందుకు ఎవరి స్థాయిలో వారు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. డోన్ పీఆర్‌ఐలో డీఈఈగా విధులు నిర్వహిస్తున్న నాగిరెడ్డి పాణ్యం పీఆర్‌ఐకి వచ్చేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే కోడుమూరు పీఆర్‌ఐ నుంచి మహేశ్వరరెడ్డి కర్నూలు పీఐయుకు, ఎస్ఎస్‌ఏ నుంచి కర్రెన్న కోడుమూరు పీఆర్‌ఐకి, పాణ్యం పీఆర్‌ఐ నుంచి మనోహర్ ఆలూరుకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే మంత్రాలయం పీఆర్‌ఐ నుంచి అశ్వర్థామ ఆదోని ఈఈ కార్యాలయానికి, ఆదోని పీఆర్‌ఐ నుంచి రంగస్వామి మంత్రాలయం పీఆర్‌ఐకి , నందికొట్కూరు పీఐయు నుంచి లక్ష్మినారాయణ పత్తికొండ పీఐయుకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. వీరంతా కూడా స్థానిక ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలతో దరఖాస్తు చేసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అలాగే కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మొత్తం 114 మంది ఏఈలు ఉండగా, వీరిలో ఒకే ప్రాంతంలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు 43 మంది ఉన్నారు. వీరంతా కూడా తమకు అనుకూలమైన మండలాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు షురూ చేశారు. పీఆర్ ఎస్ఈ రామ్మోహన్ మాట్లాడుతూ బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 24వ తేదీ వరకు సమయం ఉందని, రిక్వెస్ట్ బదిలీలు కోరుకునే వారు కూడా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తుల గడువు పూర్తి అయిన అనంతరం అనంతపురం యూనిట్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ద్వారా బదిలీలను చేపట్టనున్నట్లు ఈఎన్‌సీ చెప్పారన్నారు.

కూటమి నేతల లబ్ధికే గ్రామసభలు!

- నేడు ఉమ్మడి జిల్లాలోని అన్ని పంచాయతీల్లో నిర్వహణ

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చేందుకే శుక్రవారం జిల్లాలో గ్రామసభలు నిర్వహించేందుకు రంగం సిద్ధం అయింది. కాగితాల మీద గ్రామసభల ఉద్దేశాలు ఒక రకంగా ఉండగా.. క్షేత్రస్థాయిలో మరో రకంగా నిర్వహించేందుకు టీడీపీ నేతలు ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలుస్తోంది. పేరుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా.. జరిగేది టీడీపీ కార్యక్రమాలే అన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో లేబర్, మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపట్టే పనులను గుర్తించడం, ఇంతవరకు ఉపాధి నిధులతో చేపట్టిన పనులు, ఎంతమందికి పనులు కల్పించారనే దానిని, మెటీరియల్ కాంపోనెంటు కింద చేపట్టబోయే పనుల వివరాలను గ్రామసభల్లో పెట్టి ఆమోదం తీసుకుంటారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సభలు నిర్వహించనున్నారు. ఈ సభల్లో లైన్ డిపార్టుమెంట్లు అయిన పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, పశుసంవర్ధకశాఖ, అటవీ శాఖ, సెరికల్చర్ తదితర విభాగాల అధికారులు కూడా పాల్గొంటారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులపై మండల, గ్రామ స్థాయి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మూడు పార్టీ నేతల మధ్య అవగాహన కూడా కుదిరినట్లు తెలుస్తోంది. ఈ నిధులతో జేబులు నింపుకోవడానికి ఇప్పటికే పక్కా ప్రణాళికతో ఉన్నారు. అక్రమాలకు ఆమోదముద్ర వేయించడం లక్ష్యంగా గ్రామసభలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఉపాధి నిధులతో చేపట్టే లేబర్ కాంపోనెంటు, మెటీరియల్ కాంపోనెంటు పనులను గుప్పిట్లో పెట్టుకునేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లుగా స్పష్టమవుతోంది. డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి కె. పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు గ్రామసభలు నిర్వహించనున్నారు. గ్రామసభలను ఎలా నిర్వహించాలనే దానిపై ఇప్పటికే సంబంధిత ఎమ్మెల్యేలు, నేతలు స్పష్టంగా సూచనలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

శివయ్యా.. నీభూమికి నీవే రక్ష!



దేవుడి మాన్యంలో విలువైన బ్లాక్ స్టోన్


అక్రమ మైనింగ్‌ను చూపుతున్న ఆలయ అర్చకులు భాస్కరయ్య

- శివాలయం మాన్యంలో కూటమి నేత అక్రమ మైనింగ్
- మాలధారులు, అర్చకుడి పోరాటంతో తాత్కాలికంగా నిలిపివేత
- దేవుడి భూమిని కాపాడాలని భక్తుల డిమాండ్

కూటమి నేతలు బరి తెగిస్తున్నారు. రెండు నెలల వారి పాలనలోనే ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కరువైంది. కొందరైతే ఏకంగా దేవుళ్ల ఆస్తుల పైనా కన్నేశారు. మాన్యం భూముల్లో అక్రమ మైనింగ్ చేస్తూ అడ్డంగా దోచుకుతింటున్నారు. భక్తులు చేసేదేమీ లేక 'శివయ్యా.. నీ మాన్యం భూమిని నీవే కాపాడుకోవయ్యా' అంటూ మనసులోనే దణ్ణం పెట్టుకుంటున్నారు.

బనగానపల్లె: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల అక్రమాలు, కబ్జాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. చివరకు దేవుడి మాన్యం అయినా వదలడం లేదు. పలుకూరు గ్రామంలోని రామేశ్వరస్వామి (శివాలయం) ఆలయానికి సర్వే నంబరు 308లో 4 ఎకరాల మాన్యం ఉంది. ఇందులో కోట్లాది విలువ చేసే నాపరాయి(బ్లాక్‌స్టోన్) ఉంది. ఈ భూమిని ఇప్పటికే కొందరు మైనింగ్ యజమానులు ఆక్రమించుకుని నాపరాయి వెలికి తీసి రూ.లక్షల్లో సొమ్ము చేసుకోగా ఇటీవల కూటమి ప్రభుత్వానికి చెందిన ఓ సానుభూతిపరుడు శివాలయానికి సంబంధించిన మాన్యం భూమిలో అక్రమ మైనింగ్‌కి పాల్పడుతూ కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నాడు. 20 రోజుల నుంచి యథేచ్ఛగా నాపరాయి వెలికి తీసి జేబు నింపుకుంటున్నాడు. ఈ విషయం తెలిసిన ఆలయ అర్చకులు భాస్కరయ్య ఈ భూమి ఆలయానికి సంబంధించినదని వాదించినా, ఆక్రమణదారుడు ఏ మాత్రం పట్టించుకోకుండా భూమి తనదేనంటూ మైనింగ్‌కు పాల్పడుతున్నాడు. మాన్యం భూమిని రీ సర్వే చేసి రక్షించాలని ఆలయ అర్చకులు గ్రామ సచివాలయంతో పాటు దేవదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరూ స్పందించిన దాఖలాలు లేవు. ఈక్రమంలో గ్రామానికి చెందిన కొందరు శివమాలధారులు, ప్రజలు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న కూటమి సభ్యుడిపై వాగ్వాదానికి దిగారు. దీంతో చేసేదేమీ లేక తాత్కాలికంగా మైనింగ్‌ను ఆపివేశాడు. రెవెన్యూ, దేవదాయశాఖ అధికారులు స్పందించి దేవుడి మాన్యాన్ని సర్వే చేయించి హద్దులు వేయించాలని గ్రామస్తులు, శివస్వాములు కోరుతున్నారు.


దేవుడి మాన్యం భూమిని సర్వే చేయాలని గ్రామ సచివాలయంలో ఇచ్చిన అర్జీ

దేవుడి మాన్యాన్ని కాపాడాలి

గ్రామంలో రామేశ్వరస్వామికి సంబంధించిన నాలుగు ఎకరాల విలువైన భూమి ఉంది. ఆ భూమిలో కొందరు అక్రమంగా మైనింగ్ చేస్తుంటే గ్రామ పెద్దల సహకారంతో ప్రస్తుతానికి నిలిపి వేయించాం. రెవెన్యూ అధికారులు, దేవదాయశాఖ అధికారులు వెంటనే సర్వే చేయించి దేవుడి మాన్యాన్ని కాపాడాలి.

– భాస్కరయ్య, ఆలయ అర్చకులు